
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి జిన్నా వెంకట లక్ష్మీనారాయణ దంపతులు (గుంటూరు) సోమవారం రూ.1,00,001 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.1	27.0
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు



బీఎస్ఎం వలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలోని వివిధ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, ఇతర సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించారు. జిల్లా సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. దీనిని ఉల్లంఘించిన యాజమాన్యాలకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కొండెక్కిన ఎన్నికల కోడ్



చింతాలమ్మ గుడి ఆవరణలోనే టీడీపీలో చేరిన వారితో గోరంట్ల

కడియం: టీడీపీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎన్నికల కోడ్‌ను కొండెక్కించేశారు. కడియం మండలం పొట్టిలంకలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేపట్టిన ఆయన.. గ్రామస్తుల ఇలవేల్పు చింతాలమ్మ ఆలయంలోకి నేరుగా పార్టీ కండువాలతోనే వెళ్లిపోయారు. ఆ పార్టీ నాయకులందరూ కండువాలతోనే గుడి లోపలికి వెళ్లి ఫొటోలకు పోజులిచ్చారు. అదే ఆలయ ఆవరణలో మాజీ ఉప సర్పంచ్ కొత్తపల్లి రాజుబాబు తదితరులకు గోరంట్ల టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రతిసారీ రూల్స్‌పై మాట్లాడే గోరంట్ల.. స్వయంగా ఇలా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడంపై గ్రామస్తులు విస్తుపోయారు.

ఘనంగా సీతారాముల వనవిహారోత్సవం

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకులు శ్రీ సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం స్వామి, అమ్మవార్ల వనవిహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వెంట రాగా నవదంపతులు సీతారాములను ఊరేగింపుగా కొండ దిగువన గార్డెన్ వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేక సింహాసనాలపై సీతారాములను, సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వేంచేయించి, పండితులు పూజలు చేశారు. నవదంపతులకు దేవస్థానం అధికారులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం వనవిహారోత్సవం నిర్వహించారు.

నేడు శ్రీచక్రస్నానం

శ్రీరామ నవమి ఉత్సవాల ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 8 గంటలకు పవర్‌హౌస్ వద్ద పంపా నదిలో సీతారాములకు శ్రీచక్రస్నాన మహోత్సవం నిర్వహించనున్నారు. నదిలో నీరు లేకపోవడంతో స్నానఘట్టాలకు దూరంగా నీరు ఉన్న చోట గుంత తవ్వి, అందులో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 నుంచి వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు.

కోలాహలం

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- భారీగా ర్యాలీలు
- ఎంపీ స్థానానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే స్థానానికి మార్గాని భరత్ నామినేషన్

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక సమరం తొలి ఘట్టమైన నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మంచి తేదీ, ముహూర్తం చూసుకుని వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. తమ ఇష్ట దైవం వద్ద పత్రాలు పెట్టి పూజలు చేస్తున్నారు. భారీ జన సమీకరణ, ర్యాలీతో కుటుంబ సమేతంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్లు వేస్తున్నారు. వారు వెళ్తున్న మార్గాలు భారీగా తరలుతున్న ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి. అభ్యర్థులపై అభిమానులు పూల జల్లులు కురిపిస్తున్నారు. నామినేషన్ల కోలాహలంతో నియోజకవర్గ కేంద్రాల్లో పండగ వాతావరణం నెలకొంటోంది. జిల్లావ్యాప్తంగా రాజమండ్రి రూరల్, అనపర్తి మినహా మిగిలిన ఒక పార్లమెంట్, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడం పూర్తయ్యింది. వీరితో పాటు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు సైతం నామినేషన్లు సమర్పించారు.

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి

రాజమండ్రి లోక్‌సభ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సోమవారం నామినేషన్ వేశారు. తొలుత తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులతో ర్యాలీగా సోమాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం రామాలయం జంక్షన్, బొమ్మూరు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్‌కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన వెంట రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, గూడూరి సతీమణి రాధిక ఉన్నారు. కార్యక్రమంలో శాఖ రాష్ట్ర మంత్రి, పార్టీ రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ సిటీ మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజమండ్రి సిటీ నుంచి మార్గాని భరత్‌రామ్

రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎంపీ మార్గాని భరత్ రామ్ నామినేషన్ వేశారు. నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌కు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు అభిమానులతో ఉదయం ర్యాలీగా బయలుదేరారు. విశేష సంఖ్యలో బైక్‌లు, కార్లు, ఆటోలపై తరలివచ్చిన ప్రజలతో మార్గాని ఎస్టేట్స్ నుంచి సాగిన ఈ ర్యాలీ జన ప్రవాహాన్ని తలపించింది. కంబాల చెరువు వరకూ ర్యాలీ కొనసాగగా.. అక్కడి నుంచి పాదయాత్రగా నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వరకూ వెళ్లారు. ఎంపీ భరత్, ఆయన సతీమణి మోనా, భరత్ తల్లి ప్రసూన రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.



సతీమణి మోనాతో కలిసి నామినేషన్‌కు వెళుతున్న ఎంపీ, రాజమండ్రి సిటీ అభ్యర్థి భరత్



నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్ సీపీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ఇప్పటికే పలువురి నామినేషన్లు

- ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నేతలు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారు. రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా రాజానగరం సాయిబాబా ఆలయంలో సతీసమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం వందలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులతో ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ వేశారు.
- నిడదవోలులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కలసి తన క్యాంపు కార్యాలయం నుంచి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.
- గోపాలపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హోం మంత్రి తానేటి వనిత యర్నగూడెంలోని తన క్యాంప్ కార్యాలయంలో సర్వమత ప్రార్థనల అనంతరం భారీ ఊరేగింపుగా గోపాలపురం చేరుకున్నారు. సుమారు 12 కిలో మీటర్ల మేర ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు.
- కొవ్వూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు.. ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, భారీ సంఖ్యలో ప్రజలు వెంట రాగా ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.
- ఇదిలా ఉండగా, రాజమండ్రి ఎంపీ స్థానానికి బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, రాజమహేంద్రవరం రూరల్, సిటీ, గోపాలపురం, కొవ్వూరు స్థానాలకు టీడీపీ నేతలు బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు ఇప్పటికే నామినేషన్లు వేశారు.
- జిల్లాలోని ఒక పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం 20 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. వీరిలో అనపర్తి నుంచి బీజేపీ తరఫున ములగపాటి శివరామ కృష్ణంరాజు తదితరులున్నారు.

ఘనంగా సత్యదేవుని ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణ తదితరులు

అన్నవరం: సత్యదేవుని ఆలయ చరిత్రలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సత్యదేవుని ఆలయం ముందు స్వర్ణ ధ్వజస్తంభం, జాతీయ రహదారిపై విశాఖపట్నం - విజయవాడ మార్గంలో డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మించిన నమూనా ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ఉదయం 10.48 గంటల సుముహూర్తంలో వైభవంగా నిర్వహించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠించారిలా..

రత్నగిరిపై స్వామివారి ఆలయంలోని అనివేటి మండపంలో ఉన్న ధ్వజస్తంభానికి ఉదయం 9 గంటలకు పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, నెల్లూరుకు చెందిన దాత దంపతులు, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ దంపతులు, భక్తులు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం తవ్విన గొయ్యిలో నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలు, నవపాషాణాలు వేసి, పూజలు చేశారు. భక్తులు కూడా వివిధ నాణేలు, నవరత్నాలు సమర్పించారు. భక్తులు జై సత్యదేవ అని భక్తిపారవశ్యంతో నినాదాలు చేస్తుండగా ధ్వజస్తంభాన్ని లాంఛనంగా క్రేన్ సహకారంతో ఆ గోతిలోకి దించి నిలబెట్టారు. ఇదే ముహూర్తానికి జాతీయ రహదారిపై నిర్మించిన నమూనా ఆలయంలో కూడా కలశ ప్రతిష్ఠ, సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు.

పవన్ కల్యాణ్‌పై చర్మకారుడి పోటీ

పిఠాపురం: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్టు ఇప్పటికే ఒక ట్రాన్స్‌జెండర్ ప్రకటించగా.. తాజాగా ఓ చర్మకారుడు కూడా ఆయనపై పోటీకి సిద్ధమంటున్నాడు. డిగ్రీ చదువుకున్నా కానీ కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న పట్టభద్రుడిని కాబట్టే చట్ట సభలకు వెళ్లాలని నిర్ణయించుకున్నానని, అందుకే పిఠాపురంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి నిర్ణయించుకున్నానని అంటున్నాడు పిఠాపురానికి చెందిన చర్మకారుడు ఏడిద భాస్కరరావు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కాలేజీ వద్ద చెట్టు కింద 20 ఏళ్లుగా చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి సోమవారం నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. రెండు రోజుల్లో నామినేషన్ దాఖలు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సినీ యాక్టర్ పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీ చేస్తున్నారని, ఎక్కడి నుంచో ఇక్కడకు వచ్చి అందరూ పోటీ చేస్తూంటే స్థానికుడిగా బీఏ పొలిటికల్ సైన్స్ చదువుకున్న తానెందుకు పోటీ చేయకూడదని అనిపించిందన్నారు. అందుకే నాలుగు నెలలుగా నియోజకవర్గ సమస్యలను పత్రికల ద్వారా సేకరించానన్నారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ పరిష్కరిస్తానని చెబుతున్న పిఠాపురంలోని సమస్యలను తాను నాలుగు నెలల క్రితమే గుర్తించానన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వాడిని కాబట్టి, ప్రజల సమస్యలు తీర్చాలంటే చట్ట సభలే వేదిక అని తలచి పోటీలో ఉండాలనుకుంటున్నానని చెప్పారు. తనకు తెలిసిన వారందరి మద్దతూ కోరుతున్నానని, చాలా మంది ముందుకు వస్తున్నారని అన్నారు. ఎలాగైనా పవన్ కల్యాణ్‌పై గెలుస్తాననే నమ్మకం తనకుందన్నారు. త్వరలో తాను కూడా ఓ మేనిఫెస్టో తయారు చేసుకుని, ప్రకటిస్తానని భాస్కరరావు తెలిపారు.



నామినేషన్ పత్రాలతో భాస్కరరావు

వైఎస్సార్ సీపీ కమిటీలలో పలువురికి పదవులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి జిల్లా స్థాయి పదవులు దక్కాయి. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఈ ఉత్తర్వులు వెలువరించింది. జిల్లా పార్టీ కమిటీ సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర నియమితులయ్యారు.

మైనార్టీ కమిటీ

మైనార్టీ విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికి చెందిన ఎండీ హమీద్‌బాషా, జనరల్ సెక్రటరీగా ఎస్‌కే ఇబ్రహీం, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే అబ్దుల్ రహీం నియమితులయ్యారు.

వైద్య విభాగం

వైద్య విభాగం కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ అనుసూరి పద్మలత (రాజమహేంద్రవరం సిటీ), ఉపాధ్యక్షులుగా బండేల రాజశేఖర్ (కొవ్వూరు), ఎస్.వెంకటేష్ (రాజానగరం), జనరల్ సెక్రటరీలుగా బల్లా శ్రీనివాసరావు(రాజమహేంద్రవరం సిటీ), పి.దేవానందం (రాజమహేంద్రవరం రూరల్), ఎస్‌కే ఇమామ్ (రాజమండ్రి రూరల్), సూరిశెట్టి భాస్కర్ (రాజానగరం), పంద్రాకుల వీర వెంకట సత్యనారాయణ (కొవ్వూరు), రేలంగి మారుతీ శివ భాస్కర్ (నిడదవోలు), పి.చిన్ని (జగ్గంపేట), సుందరపల్లి సుధాకర్ (రాజానగరం) నియమితులయ్యారు. సెక్రటరీలుగా డీవీ కాలాబత్తుల రాజశేఖర్ (రాజమహేంద్రవరం సిటీ), కోరుపోలు నాని (రాజానగరం), తూము రవి (రాజానగరం), సూరంపూడి రవిప్రసాద్ (కొవ్వూరు), కండేటి వెంకట సూర్యాంగ సత్యనారాయణమూర్తి (కొవ్వూరు), పేరూరి ధనశంకరం (నిడదవోలు), పోతుల సత్య వరప్రసాద్ (నిడదవోలు), జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ కట్రో రేఖ (రాజమహేంద్రవరం సిటీ), డాక్టర్ షాకీర్ అబ్బాస్ (రాజమహేంద్రవరం సిటీ), డాకే శ్రీనివాసరావు (రాజమహేంద్రవరం రూరల్), ఎంవీవీ.సత్యనారాయణ (రాజమహేంద్రవరం రూరల్), వీవీ నర్సయ్య (రాజానగరం), గల్లా అచ్యుత్ (రాజానగరం), కొల్లూరి దేవీ నాగ విశ్వతేజ (నిడదవోలు), ఎంవీఎస్ సూర్యనారాయణ (నిడదవోలు)ను నియమించారు.



అనుసూరి పద్మలత, వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు



ఎండీ హమీద్‌బాషా, మైనార్టీ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు



ఎస్‌కే ఇబ్రహీం, మైనార్టీ కమిటీ జిల్లా జనరల్ సెక్రటరీ

అదరగొట్టిన అమ్మాయిలు

- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి
- జిల్లాలో 83.20 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు
- ప్రైవేటుకు దీటుగా రాణించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

సాక్షి, రాజమహేంద్రవరం: పదో తరగతి ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా అమ్మాయిలు అదరగొట్టారు. గత నెల 18 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. జిల్లా వ్యాప్తంగా 23,367 మంది ఈ పరీక్షలకు హాజరు కాగా 19,441 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది జిల్లా ఉత్తీర్ణత శాతం 70.32 కాగా ఈసారి అది 83.2 శాతానికి ఎగబాకడం విశేషం. రాష్ట్రంలో జిల్లా 21వ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఈసారి సున్నా శాతం ఫలితాలు సాధించిన పాఠశాల ఒక్కటి కూడా లేకపోవడం విశేషం. ఈ పరీక్షల్లో మొత్తం 3,926 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. వీరికి వచ్చే నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు రీ వెరిఫికేషన్, కౌంటింగ్‌కు ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

పెరిగిన ఉత్తీర్ణత

గత ఏడాది పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 22,465 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 15,798 మంది ఉత్తీర్ణులై 70.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. 11,334 మంది బాలురకు 7,641 మంది (67.42 శాతం), 11,131 మంది బాలికలకు 8,157 మంది (73.28 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 11,410 మంది ప్రథమ, 2,875 మంది ద్వితీయ, 1,513 మంది తృతీయ శ్రేణుల్లో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత 12.7 శాతం పెరిగి, 83.2 శాతంగా నమోదు కావడం విశేషం.



589 మార్కులతో రాజమహేంద్రవరం సిటీ ఫస్ట్‌గా నిలిచిన సిటీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థి వీఎస్‌వీప సాయిహాష్‌ను అభినందిస్తున్న అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు వైవీ రామారావు

జిల్లాలో టెన్త్ ఫలితాలు ఇలా..

పరీక్షకు హాజరైన విద్యార్థులు	: 23,367
ఉత్తీర్ణులైన వారు	: 19,441
ఉత్తీర్ణత శాతం	: 83.20
ప్రథమ స్థానం	: 14,684
ద్వితీయ	: 3,101
తృతీయ	: 1,656
పరీక్షకు హాజరైన బాలికలు	: 11,430
ఉత్తీర్ణులు	: 9,793
ఉత్తీర్ణత శాతం	: 85.68
పరీక్షకు హాజరైన బాలురు	: 11,937
ఉత్తీర్ణులు	: 9,648
ఉత్తీర్ణత శాతం	: 80.82

ప్రత్యేక శ్రద్ధతో..

విద్యార్థుల ప్రగతిపై ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. టెన్త్‌లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించింది. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్ పెట్టి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా తీర్చిదిద్దారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి, తిరిగి రివిజన్ చేయడంతో విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా గుర్తు పెట్టుకుని పరీక్షల్లో రాసేలా శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులతో తరచుగా సమావేశమై, తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి, వారి ప్రతిభను గుర్తించారు. వెనుకబడవుతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నమూనా పబ్లిక్ పరీక్షలు నిర్వహించి, వాటిలో మార్కుల సాధనపై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఫలితంగా విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో మంచి పట్టు సాధించారు. ఇటువంటి చర్యలన్నీ మెరుగైన ఉత్తీర్ణతకు దోహదం చేశాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

విరిగిన కుర్చీలు.. కనీస వసతులకు కూడా నోచుకోని తరగతి గదులు.. ఒకే గదిలో కిక్కిరిసిన విద్యార్థులతో అవస్థలు.. ఆపై బోధనా సిబ్బంది కొరతతో అల్లాడుతున్న అధ్యాపకులు.. అందని ద్రాక్షగా మారిన మెరుగైన విద్యా బోధన.. ఇదీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగం ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. నిరాదరణకు గురై, వసతుల లేమితో కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. బోధనా సిబ్బంది కొరత తీర్చారు. డిజిటల్ ప్లాట్‌ఫాంపై పాఠ్యాంశాల బోధన దిశగా అడుగులు వేశారు. కాలికి వేసుకునే బూట్ల నుంచి.. యూనిఫాం, బ్యాగ్, ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు.. రోజుకో రుచికరమైన వంటకాలతో మధ్యాహ్న భోజనం.. ఇలా అనేకం విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఫలితంగా పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని రీతిలో అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారు.

క్లుప్తంగా

ఓడిన చోటే కూతురు గెలిపించింది!


కుమార్తె శ్రీ తేజస్వినికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి ప్రభాకర్

బిక్కవోలు: ఇంకా ఎన్నికలు జరగలేదు. ఓడినచోట కూతురు గెలిపించడం ఏమిటా అని అనుకుంటున్నారా? ఇది నిజం. అయితే ఎన్నికల్లో కాదు పదోతరగతి ఫలితాల్లో ఇది జరిగింది. సోమవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని కొంకుదురు గ్రామంలో కుక్కల శ్రీ తేజస్విని 556 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానం కైవసం చేసుకుంది.

అయితే తన తండ్రి కుక్కల ప్రభాకర్ ఇదే పాఠశాలల్లో 1996 పదోతరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. అప్పటి నుంచి కూలీ పనిచేస్తున్నా తన ఇద్దరు పిల్లలను చక్కగా చదివించాడు. అయితే 2022లో తన కుమారుడిపై ఆశలు పెట్టుకున్నాడు. కాని కుమారుడు తృతీయ స్థానం సాధించాడు. అప్పటి నుంచి కుమార్తె శ్రీ తేజస్విని మరింత శ్రద్ధ తీసుకోవడంతో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నాడు. తన కలను కూతురు సాకారం చేయడంలో పాఠశాల ఉపాధ్యాయులు సహకారం అందించారని ఆయన తెలిపాడు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండిలా..

- టెన్త్ విద్యార్థులకు ఈ నెల 30 వరకు అవకాశం
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
- మే 24 నుంచి జూన్3 వరకు పరీక్షలు
- త్వరలో టైమ్ టేబుల్ విడుదల

రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్నవారు పునఃమూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్ఎంకు మాత్రమే ఫీజు చెల్లించాలి

ఈ ఏడాది పది పరీక్షలు రాసిన విద్యార్థులు పాసైనా/ఫెయిలైనా పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్/రీ కౌంటింగ్ కోసం మంగళవారం నుంచి ఈ నెల 30వ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్/రీ కౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జవాబు పత్రాల రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల హెచ్ఎం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్ఎంకి మాత్రమే ఫీజును సమర్పించాలి. అన్ని రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేయాలి. సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు ఆమోదించరు.

ముఖ్య సూచనలు

అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్ఎంలు అటెస్టేషన్ చేయించి, సంబంధిత విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. నేరుగా విజయవాడలోని డీజీఈ కార్యాలయం(ఎస్ఎస్‌సీ బోర్డు)కు పంపించరాదు. దరఖాస్తులు పోస్టు ద్వారా స్వీకరించరు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోనవసరం లేదు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికీ మార్కులు వచ్చాయా లేదా అని ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసిన విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి కూడతారు. తప్పుగా కూడి ఉంటే సరి చేసి మార్కులు వేస్తారు. అంతేగాని పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ దరఖాస్తు ఇలా..

మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల టైమ్‌టేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. వచ్చే నెలలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులకు ప్రతీ పాఠశాల హెచ్ఎం/సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ఫీజును నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించే వీలుంది. మే ఒకటో తేదీ నుంచి 23వ తేదీ వరకు రూ.50ల అపరాధ రుసుంతో ఫీజును చెల్లించే వీలుంది.



ఫీజుల వివరాలు

చెల్లించాల్సిన ఫీజులను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాల హెచ్ఎం లాగిన్ ద్వారా చెల్లించాలి. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజుగా ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించాలి. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలి.

నాలుగు రోజుల్లో మార్కుల జాబితాలు

ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫస్టియర్ కోర్సుల్లో చేరేందుకు నాలుగు రోజుల తర్వాత మార్కుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. సంబంధిత హెచ్ఎం స్కూల్ లాగిన్ నుంచి పాఠశాలల వారీగా మార్కుల మెమొరాండం, వ్యక్తిగత షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండానే నేరుగా అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్ఈఎస్‌యుఎల్‌టీఎస్.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ నుంచి ఫలితాలు, షార్ట్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉత్తీర్ణులైన అభ్యర్థులందరికీ నిర్ణీత సమయంలో ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు సంబంధిత పాఠశాలలకు పంపిస్తారు. మార్చి-2024, ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థుల నామినల్ రోల్ ఈ నెల 24 నుంచి అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అందుబాటులో ఉంచుతారు.

నన్నయ వీక్షిత్ భారత్


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ 18వ ఫౌండేషన్ డేని పురస్కరించుకుని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన వీక్షిత్ భారత్ థీమ్ కార్యక్రమాలను వీసీ ప్రారంభించారు. శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కానవరం విద్యార్థులు ఉదయం యోగ ఆసనాలు వేయించి, యోగ సాధన ఆవశ్యకతను తెలియజేశారు. మధ్యాహ్నం వీక్షిత్ భారత్ 2047 థీమ్ ఓరియెంటెడ్ డాన్స్, మైమ్, స్కిట్స్‌లను క్యాంపస్, అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించారు. సీటీఆర్ఐ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవిర్భావ లక్ష్యాలను నెరవేర్చే దిశగా యువత పయనించాలని సూచించారు. యూజీసీ వీక్షిత్ భారత్ జాబితాలో నన్నయ యూనివర్సిటీ ఉండటం హర్షణీయమన్నారు. సీఎస్ఐఆర్ రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ జీ. భగవాన్ నారాయణ రీసెర్చ్ మెథడాలజీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ.సుధాకర్, డాక్టర్ ఎస్.శేషారెడ్డి, డాక్టర్ రామచంద్రరాజు, డాక్టర్ సీహెచ్.సత్యనారాయణ, డాక్టర్ రామరాజు ప్రసంగించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

రూ.8.97లక్షల విలువైన 128.27 గ్రాముల ఆభరణాల స్వాధీనం

కొవ్వూరు: వివిధ చోరీలకు పాల్పడిన పాత నేరస్తుడైన చుక్కపల్లి బాబి అనే ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. అతని వద్ద నుంచి 128.27 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గతంలో కొవ్వూరులో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఒక ఇంటిలోను, ఆరికిరేవుల గ్రామంలో ఒక రేకుల షెడ్‌లోను, కుమారదేవం, పోలవరంలోను ఇళ్లల్లో పగటి పూట ఎవరూ లేని సమయంలో ఇళ్లల్లోకి చొరబడి విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుని పోయాడన్నారు. సోమవారం కొవ్వూరు ఏటిగట్టుపై ఉన్న శివాలయం ఎదురుగా ఉన్న వీధిలో నిందితుడు అద్దెకి ఉంటున్న ఇంటి వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. చోరీ సోత్తు విలువ రూ.8,97,190 ఉంటుందన్నారు. నిందితుడు గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన వాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నిందుతుడిని అరెస్ట్ చేయడంలో ఎస్సై కె.జగన్మోహన్‌రావు, సిబ్బంది సహకరించారన్నారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

- మేళతాళ మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం
- విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా కాల్పులు
- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


గౌతమీ గోదావరిలో సాగిన స్వామివారి తెప్పోత్సవం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. స్వామి వారి కల్యాణోత్సవాలు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం వేదపండితులు శ్రీమాన్ ఖండవల్లి వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణ నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వస్తి వచనం, కల్యాణోత్సవ ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం 6 గంటలకు సంకల్పం, ప్రధాన హోమాలు నిర్వహించారు. కేరళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం గౌతమీ గోదావరి నదిలో విద్యుత్ దీపాలంకరణతో సుందరీకరించిన హంస వాహనంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, భక్తజనం గోవింద నామస్మరణ నడుమ స్వామివారు ఉభయ దేవేరులతో గౌతమీ గోదావరిలో విహరించడాన్ని భక్తజనం తన్మయత్వంతో వీక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను రంజిపజేశాయి. ఈ కార్యక్రమాలను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం గౌతమీ గోదావరినదిలో స్వామివారి చక్రస్నాన మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో వివరించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ సోమవారం ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన చోడవరపు పాపారావు(56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఆదివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. పాపారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి ముందంజ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో శ్రీషిర్డీసాయి విద్యానికేతన్ రాజమహేంద్రవరం, కడియం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి. శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్య ఓరియంటేషన్‌తో 10 వ తరగతి చదివిన వి. ఉదయ రుషిత 600 మార్కులకు 593 సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ఎస్.సాయి అక్షయ, బి.యశశ్విని 592 మార్కులు, ఎం. జాహ్నవి, ఎస్. దేవికృష్ణసిరి 591, ఎ. లోహిత్ కుమార్ 590 మార్కులు సాధించినట్లు వివరించారు. ఆరుగురు విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించగా, 24 మంది 580 మార్కులకు పైగా, 44 మంది 570కి పైగా మార్కులు, 75 మంది 550కి పైగా మార్కులు సాధించారు. హాజరైన మొత్తం 164 మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయినట్లు తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ కె. శ్రీనివాస్ అభినందించారు.


విద్యార్థులతో శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

10వ తరగతి ఫలితాలలో

తిరుమల విజయభేరి


10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.రఘువీర్ 595 మార్కులు, కె.సుప్రియ 595 మార్కులు, ఏపీఆర్ సాయిశ్రీలత, బి.లలితరాణి, కె.సత్యభాస్కర్ 594 మార్కులు, టి.ప్రీతిశరణ్య, ఎం.ఇబ్రహీం 593మార్కులు, కె.అశ్రిత, ఎంవీఎల్ఏ వాత్సల్య, ఎం.గ్రీష్మశ్రీ, బియ్య.ప్రసాద్, పి.శ్రీతుల్య, జేవీఎస్ సత్యసాయిదత్త, వై.తేజశ్వి, ఎస్.రంజిత్‌కుమార్ 592మార్కులు, వై.కృష్ణచైతన్య, ఎల్.వైష్ణవి, సీహెచ్.లోక్‌ప్రకాష్, ఎస్‌వీఎస్.శ్రీధర్, డి.చిన్మయి 591మార్కులు సాధించారన్నారు. 590పైన 34మంది విద్యార్థులు, 580పైన 223 మంది విద్యార్థులు, 570పైన 451మంది, 560పైన 642 మంది, 550పైన 779మంది, 500పైన 451మంది , 560పైన 642మంది, 550పైన 779మంది, 500పైన 1108 మంది విద్యార్థులు సాధించారని, 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను నున్న తిరుమలరావు, డైరెక్టర్ సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

పది ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ సోమవారం తెలిపారు. హనుమంతు గాయత్రి-596 మార్కులు సాధించిందన్నారు. పి.కృష్ణ నాగ సాహితి-595, ఎస్.సూర్యతేజ- 594, కె.సత్యవాణి, పి.రఘురామ్, ఎస్‌జె.విజయదుర్గ-593, జి.సత్య శ్రీహర్ష, సీహెచ్ బిందుజ, బి.వైష్ణవి కావ్య-592, ఎస్.వర్షిత, పి.ప్రణవి సాత్విక, కె.శ్రీరామ్ శ్రవణ్, సీహెచ్ బద్రి, వి.తన్మయి, కేఎస్.క్రిష్ణ లక్ష్మి తేజస్విని, ఎల్.మణిగుప్త-591, సీహెచ్ జ్ఞానేశ్వరి, సీహెచ్.శాంతిప్రియ, కె.నరసింహ గుప్తా, బి.నిత్య హర్షిత- 590 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

11న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తి మాధురి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మే 11వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు రెవిన్యూ, పంచాయతీరాజ్ అధికారులు తమ పరిధిలో ఉన్న రాజీపడదగిన కేసులను గుర్తించాలని తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో ఆమె ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి రాజీపడదగిన జాబితాను అధికారులు సిద్ధం చేసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, గవర్నమెంటు ప్లీడరు సీహెచ్‌వీ ప్రసాద్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

విస్తృత తనిఖీల్లో మద్యం పట్టివేత

- 18 మంది అరెస్ట్
- రూ.2.06 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు అక్రమ రవాణాను పసిగట్టేందుకు దాడులు, తనిఖీల వేగాన్ని మరింత పెంచాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో జరిగిన దాడులు, తనిఖీల్లో అక్రమ రవాణాను అడ్డుకుని 18 మందిని అరెస్ట్ చేశారు. నగదు రూ.2.06 లక్షలు సీజ్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులు, స్వాధీనాల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 5.4 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రావులపాలెంలో నిఘా బృందాలు వాహనాలను తనిఖీ చేసి రూ.2.06 లక్షల నగదును సీజ్ చేశారు.
- ఆలమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న అయిదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,220 నగదు సీజ్ చేశారు. 4 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు.
- రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు పోలీసు స్టేషన్ల పరిధుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 70 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 18.03 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట ముమ్మిడివరం ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 83 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 15.51 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలైన ఐ.పోలవరం మండలం మురమళ్ల,పశువుల్లంకలలో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలసి సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజలతో పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా ఇస్తూ అవగాహన కల్పించారు.


ఐ.పోవవరం మండలం పశువుల్లంకలో స్థానికులతో సమావేశమై ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి